


కాకినాడలో ఆదివారం ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలతో అతిథులు ఎమ్మెల్సీ పద్మశ్రీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కమిషనర్ భావన తదితరులు







ముగ్గుల పండగ

'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగ ముందే వచ్చే సింది.. ముగ్గులతో కళ తెచ్చేసింది.. సంక్రాంతి పండుగ ముందు రావడం ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారా.. అదే మరి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రత్యేకత.. తెలుగింట సంప్ర దాయంలో భాగంగా ప్రతి ఏడాది 'ఏబీ ఎన్-ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీ లను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సంక్రాం తి పండుగను తలపిం చేలా ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం షిర్డిసాయి విద్యానికే తన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాలోని జీఎంసీ బాలయోగి స్టేడియం లో శనివారం ముగ్గుల పోటీ లు నిర్వహిం చారు.కాకినాడ జిల్లాలో మెక్‌లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివా రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. ఉత్సా హంగా ముగ్గులు వేశారు.ఆయా ప్రాంగ ణాలు భువిపై చుక్కలు దిగివచ్చా యా అన్నట్టు మెరిశాయి..మహిళలు ఒకరికొకరు పోటాపోటీగా ముగ్గులు వేశారు. బహుమ తులకు ముగ్గులను ఎంపిక చేయడం న్యాయనిర్ణేతలకు సవాల్‌గా మారింది. మూడు జిల్లాల్లోనూ మూడేసి చొప్పున బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి విజేతకు రూ.6 వేలు ..ద్వితీయ బహుమతి విజేతకు రూ.4 వేలు..తృతీయ బహుమతి విజేతకు రూ.3 వేలు అంద జేశారు. ఇవి కాక పెద్ద ఎత్తున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలకు హాజరైన ప్రతి ఒక్కరికి బహు మతి ఇచ్చి పంపారు.. పోటీలకు హాజరైన పలువురు మహిళలు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల కోసం ఏడాదంతా ఎదురుచూస్తూనే ఉంటామని చెప్పడం గమనార్హం. కొం దరైతే తెలుగు సంప్రదాయాన్ని గుర్తు చేస్తున్న 'ఆంధ్ర జ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు. ఎందుకంటే నాడు పట్టణ మైనా..పల్లె అయినా ధనుర్మాసం ఆరంభం నుంచి ముగిసే వరకూ ముగ్గులతో వీధు లన్నీ కళకళలాడేవి.. రోగాలను దూరం చేసేవి.నేడు రోగాలు పెరి గాయి..ముగ్గులు తగ్గాయి. కాలంతో పాటు జీవన విధానం లోనూ మార్పులు వచ్చాయి.. ఒకనాడు టీవీ.. నేడు సెల్‌ఫోన్లకు అతుక్కుపోతు న్నారు..ఈ విధానం మారాలి.. మళ్లీ ఆ పాత సంప్రదాయాన్ని తట్టి లేపడానికే 'ఆంధ్రజ్యోతి' ప్రతి ఏడాది ముగ్గుల పోటీ లు నిర్వహిస్తోంది.

చుక్కల ముగ్గు.. లెక్క తేల్చగలరా?

చుక్కలు రంగులద్దుకున్నాయి.. పువ్వు లుగా మారాయి.. అక్షరాలయ్యాయి.. ఒక రూపాన్ని సంతరించుకున్నాయి.. అందాన్ని ఆనందాన్ని పంచాయి.. అదె లాగంటే.. అదే మరి ముగ్గు ప్రత్యేకత.. 21 చుక్కలు అటూ ఇటూ.. 21 అడ్డం.. 21 నిలువు అనమాట.. చూసే వారికి ఏం అర్థం కాదు.. ఒక అరగంట ఆగి చూశామా.. ఆ చుక్కలన్నీ రకరకాల రూపాలను సంత రించుకుంటాయి. చుక్కలు ఎక్కడున్నాయో కనిపెట్టడం కష్టమే.. ఇదీ ముగ్గు ప్రత్యేకత.. నేటి కంప్యూటర్‌తరం కూడా విడదీసి చెప్ప లేని లెక్క ఇది.. ఒక్క మహిళలకు మాత్రమే అర్థమయ్యే లెక్క.. తెలుగింట సంప్రదాయం ముగ్గు..


ముగ్గు వేస్తున్న తూర్పు కలెక్టర్ ప్రశాంతి



చుక్క..చుక్క కలిపి

ఈ చుక్కలెన్నో చెప్పగలరా.. ఎక్కడున్నాయో విప్పగలరా.. చెప్పడం కష్టమే కదా.. కాకినాడకు చెందిన పోతుల సునీత ఇలా చుక్కలు ముగ్గు వేసి.. మొదటి బహుమతి సాధించారు.



ముగ్గులొలికే..

ముగ్గు చూస్తుంటే చూస్తూనే ఉండి పోవాలనిపిస్తుంది కదూ.. అదే మరి ముగ్గు ప్రత్యేకత. రావులపాలెంనకు చెందిన వి.సావిత్రి అమలాపురంలో నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి సాధించారు.



పండుగొచ్చింది!

ముగ్గు చూస్తుంటే సంక్రాంతి పండుగ వచ్చేసినట్టుంది కదూ.. అదే ఈ ముగ్గు ప్రత్యేకత.. రావుపాలెం నకు చెందిన గిరి అమ్మాజీ రాజమండ్రిలో నిర్వహించిన పోటీల్లో ముగ్గు వేసి ప్రథమ బహుమతి సాధించారు.


ఏపీ పేపరుమిల్లు కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఇతర ఎమ్మెల్యేలు

పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేస్తాం

సీఎం చంద్రబాబు ఆదేశాలు - కార్మికులతో ఎమ్మెల్యేల చర్చలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు రాష్ట్ర పరిశ్రమల ముఖ్యకార్యదర్శి కార్తికేయ మిశ్రాకు ఆదేశాలు ఇచ్చారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లులో సమ్మెకు దిగిన కార్మికులతో ఆదివారం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ సమావేశమయ్యారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రజాప్రతినిధులు మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కయి సూట్ కేసులు అందుకుని కార్మికులను రోడ్డున పడేశారని విమర్శించారు. అందుకే కార్మికులంతా ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరునెలలుగా పరిస్థితిని అర్థం చేసుకుంటున్నామన్నారు. సమస్యను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. స్పందించిన సీఎం కార్మికులకు మంచి ఒప్పందం చేయాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. ఇలాంటి సమయంలో కార్మికులు ఇంకా ఆందోళనకు కూర్చుంటే ప్రతిపక్షనాయకులు, కొందరు కార్మిక నాయకులు వారి స్వార్థం కోసం మిమ్మల్ని తప్పుదోవ పట్టించే అవకాశం ఉందన్నారు. వారికి ఆ అవకాశం ఇవ్వొద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేస్తుందన్నారు. కార్మికులకు మంచి అగ్రిమెంట్ అందించేందుకు సీఎం చంద్రబాబు పరిశ్రమల అధికారులకు ఆదేశాలు ఇచ్చారని..ఆందోళన చెందవద్దని చెప్పారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు,వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధ, బుడ్డిగ రవి,దినేష్ పాల్గొన్నారు.

జూద క్రీడలు నిర్వహించొద్దు
ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహించినా ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు.ఈ మేరకు ఆదివారం జిల్లాలో పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పేకాట గుండాట కోడిపందాలు నిర్వహించే ప్రాంతాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. పాత నేరస్తులపై బైండోవ కేసులు పెట్టాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు కోడిపందాలు, ఇతర నిషేధిత ఆటలపై డయల్ 112 కు సమాచారం అందించాలన్నారు.

చిన్నారుల ఆధార్‌కు డ్రైవ్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 0-6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు ఆధార్ నమోదు కార్యక్రమానికి సోమవారం నుంచి 10వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు.జిల్లాలో సుమారు 17 వేల మంది ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారన్నారు.ఆధార్ నమోదు సమయంలో చిన్నారుల పేరుతో ఉన్న పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకుని తండ్రి / తల్లి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరుతో ఆధార్ నమోదు చేసే సిబ్బందిని కలసి ఎన్‌రోల్ చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్న సంబంధిత ఉద్యోగులకు, సిబ్బందికి ఎటువంటి సెలవులు ఇవ్వవద్దని ఆదేశించారు.



యూటీఎఫ్ సంబరం

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో ఆదివారం ఘనంగా ఆరంభమయ్యాయి. పీఆర్ కళాశాలలో జరిగిన వేడుకలకు 20 వేల మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.. ముందుగా జాతీయ పతాకాన్ని, యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్ఐ జెండాలను సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, జీవీ రాఘవులు, జి.చిట్టిబాబు ఆవిష్కరింపజేశారు.సభలో టీచర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. -7వ పేజీలో


వెలుగుబంద కాలనీలో పెరిగిన తుప్పలు

కాలనీలు చూస్తే... ఆగవు కన్నీళ్లు!

జగనన్న కాలనీల చుట్టూ సమస్యలే

- గత ప్రభుత్వంలో పట్టని వైనం
- మొదటి దశలో 62,624 ఇల్లు
- 26,179 ఇళ్లు మాత్రమే పూర్తి
- మిగిలిన వాటి సంగతి అంతే
- ముందుకు సాగని నిర్మాణాలు
- యజమానుల ఇబ్బందులు
- అప్పుల పాలైన పేదలు
- నేటికీ తేరుకోని వైనం
- ఇళ్ల నిర్మాణాలపై కూటమి దృష్టి
- ఇప్పుడిప్పుడే కదులుతున్న వైనం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీల పేరు చెబితే సమస్యలే గుర్తొస్తాయి.. గత ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లిస్తామని జిల్లాలో 429 లేఅవుట్లు వేసి మొదటి దశ కింద 45,051 ఇళ్లు,సొంత స్థలాలు ఉన్న వారికి 17,573 ఇళ్లు మంజూరు చేశారు. వైసీపీప్రభుత్వం ఓట్ల కోసం హడావుడి చేసింది తప్పితే నివాసయోగ్యంగా మాత్రం చేయలేదు. కాలనీల్లో కనీసం రోడ్లు లేవు.. డ్రైనేజీలు లేవు.. మంచినీటి సదుపాయమూలేదు..స్థలాలు అయినా బాగున్నాయా అంటే అదీ లేదు. ఊరికి దూరంగా పొలాల మధ్య, కొండల ప్రాంతం, పల్లపు ప్రాంతాలు.. శ్మశానాల చెంత లేఅవుట్లు వేశారు.. లేఅవుట్లను మెరక చేయలేదు.కొన్ని లేఅవుట్లు కాగితాలపైనే ఉన్నాయి.భూ సేకరణలో అవినీతికి పాల్పడ్డారు. చివరకు ఇల్లు కట్టుకోకపోతే స్థలం తీసేసుకుంటామని భయపెట్టారు. తప్పని పరిస్థితుల్లో చాలా మంది అసౌకర్యాల మధ్యే ఇళ్లు కట్టుకున్నారు. దీంతో చాలా ఇళ్లు పునాది దాటలేదు. పేదింట అప్పులు మిగలడంతో లబోదిబోమంటున్నారు.

జిల్లాలో 429 లేఅవుట్లు

జిల్లావ్యాప్తంగా 429 లేఅవుట్లు వేశారు. 62,624 ఇళ్లు మంజూరు చేయగా 45,051 శాంక్షన్ అయ్యాయి.వాటిలో కేవలం 12,264 పూర్తయ్యాయి. సొంత స్థలం ఉన్న వాటిలో 17,573కి 13,915 పూర్తయ్యాయి. ఇంకా 2360 పునాదులే తవ్వలేదు.ఇక లేఅవుట్లలో 15,489 మొదలు కాలేదు.ఇలా జిల్లాలోని లేఅవుట్లు, సొంత స్థలంలో శాంక్షనైన ఇళ్లలోనే 17,849 ఇంకా మొదలు కాని పరిస్థితి ఏర్పడింది.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజమహేంద్రవరం నగర ప్రజలకు రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలో 13 వేల మందికి పట్టాలు ఇచ్చారు. సుమారు 11 వేల ఇళ్లను అక్కడ మంజూరు చేశారు. 2856 ఇళ్ల నిర్మాణం సాగింది. అందులో 1600 శ్లాబ్ వరకూ వచ్చాయి. ప్రస్తుతం అక్కడ 70 కుటుంబాలు గృహ ప్రవేశాలు చేసుకున్నాయి. సుమారు 1000 ఇళ్ల వరకూ అసలు పునాదులు వేయలేదు. కొన్ని పునాదుల్లోనే ఆగిపోయాయి. వాటిలో మొక్కలు,తుప్పలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసింది.మార్చి నాటికి మరో 70 ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.మిగిలినచోట్ల ఇప్పుడిప్పుడే ఇంటి నిర్మాణానికి ముందుకొస్తున్నారు.

మౌలిక సదుపాయాల్లేవు

జిల్లాలో చాలా లేఅవుట్లలో మౌలిక వసతుల్లేవు. లేఅవుట్లు మెరక, పల్లాలు కూడా సరిచేయకుండా వదిలేశారు.రోడ్లు,విద్యుత్, మంచినీటి సౌకర్యాలు లేవు. డ్రైనేజీ సౌకర్యం లేదు. రవాణా సౌకర్యం పెద్ద సమస్యగా ఉంది. ఎందుకంటే ఎక్కడెక్కడో మారుమూల ప్రాంతాల్లో లేఅవుట్లు వేయడంతో ప్రస్తుతం ఇబ్బందిగా మారుతోంది. వెలుగుబందలో కనీసం రోడ్లు కూడా వేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టర్ పి.ప్రశాంతి పలుదఫాలు వెలుగుబంద కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిపై ఆరా తీసి మెరుగుపరిచే ఆలోచన కూడా చేస్తున్నారు.




జగనన్న కాలనీలో కానరాని రోడ్లు

జగనన్న మోసం గురూ!

వేలాది మందిని పట్టాల బొమ్మ చూపించి వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. రాజమహేంద్రవరంలో సుమారు 60 వేల మంది పేద లకు పట్టాలు ఇస్తున్నామని కోరుకొండ మండ లం బూరుగుపూడి ఆవలో అంటగట్టే ప్రయత్నం చేశారు.అయితే నాడు ప్రతిపక్షంలో టీడీపీ ఆందోళనతో వెనుతిరిగివచ్చారు. ఈ భూముల్లో పెద్ద కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిం దే.ఆవ భూమిలో రైతుల చేత ముందుగా ఒప్పందం కుదుర్చుకుని,తక్కువ ధర పొలాలను ఎక్కువకు కొని డబ్బులు చేతులు మార్చుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.గత ఎన్నికల ముం దు వైసీపీ హడావిడిగా రాజానగరం మండలం లోని కానవరం,పల్లకడియం తదితర ప్రాంతాల్లో భూమిని కాగితాల్లో చూపి అక్కడ లేఅవుట్లు వేయకుండా పట్టాల మీద లబ్ధిదారుల పేర్లు రాసి పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ భూములు ఎక్కడున్నాయో కూడా లబ్ధిదారులకు తెలియని పరిస్థితి. జిల్లాలో అనేక చోట్ల ఇటువంటి పరిస్థితి నెలకొనడంతో లబ్ధిదారులు తమను వైసీపీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏ నియోజకవర్గం చూసినా ఏముంది!

జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పేదల ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇలా ఉంది. అనపర్తిలో 9043 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 1339 అసలు ప్రారంభించలేదు. 3590 పూర్త య్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజమహేంద్రవరం సిటీ పరిధిలో 11,712 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి.3959 అసలు మొదలెట్ట లేదు. 2318 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజానగరంలో 6800 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 1179 అసలు మొదలె ట్టలేదు. 3942 పూర్త య్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. గోకవరం మండలంలో 493 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి.5 అసలు మొదలెట్ట లేదు. 240 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. కొవ్వూరులో 11,388 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 2448 అసలు మొదలు పెట్టలేదు. 5410 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. నిడదవోలులో 12,130 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 3465 అసలు మొదలు పెట్టలేదు.6664 పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. గోపాలపురంలో 6001 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 3766 అసలు మొదలు పెట్టలేదు.1002 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 5056 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి.1649 మొదలు పెట్టలేదు.2013 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.


వెలుగుబంద కాలనీలో పునాదిలోనే ఇల్లు

రెపరెపలాడిన యూటీఎఫ్ జెండా



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, ఆర్‌జేడీ నాగమణి

- కాకినాడలో ఘనంగా ప్రారంభమైన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు
- తొలిరోజు 20వేల మంది ఉపాధ్యాయులు హాజరు
- వైసీపీ హయాంలో పాఠశాలలు నాశనం
- ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ప్రాణాలైన అర్పిస్తాం : సభలో వక్తలు

కాకినాడలో యూటీఎఫ్ ఎర్ర జెండా రెపరెపలాడింది. పీఆర్ డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ వర్ధిల్లాలి.. విప్లవం వర్ధిల్లాలి అంటూ యూటీఎఫ్ శ్రేణులు చేసిన నినాదాలు మిన్నంటాయి. ప్రాణాలైనా అర్పిస్తాం - ప్రభుత్వ బడులను కాపాడుకుంటామని నినాదాలు చేశారు.

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో విద్యావ్యవస్థ ధ్వంసమైందని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ధ్వంసమయ్యాయని, అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి ఎన్నో ఉద్యమాలు చేశామని యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో వక్తలు పేర్కొన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ 17వ స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఎన్ని ఉద్యమాలైనా చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం 117 జీవో ద్వారా పాఠశాల విద్యకు ఉరిశిక్ష విధించిందన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులను హైస్కూళ్లలో కలిపి విద్యా వ్యవస్థను నాశనం చేసిందని విమర్శించారు. వైసీపీ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో విద్యారంగం సర్వ నాశనమైందని, సీపీఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చి ఉపాధ్యాయులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. నేటి పాలకుల ఉదాసీన వైఖరి వల్ల రాజ్యాంగ లక్షణాలు మరుగునపడ్డాయని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత యూటీఎఫ్ ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ విద్యారంగ విద్య నానాటికీ కుంటుపడుతుందన్నారు. ఇప్పటికే దేశంలో సగంవరకు విద్యారంగం ప్రైవేటీకరణ జరిగిందని దీని వల్ల పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 75ఏళ్ల రిపబ్లిక్ డే ఉత్సవాలు జరుపుకుంటున్న మనం ప్రభుత్వ రంగంలో ఉన్న బడులను సంరక్షించుకోవాలన్నారు. దేశంలో వెయ్యి విశ్వవిద్యాలయాలు ఉంటే దానిలో సగం వరకు ప్రైవేటు రంగంలోనే ఉన్నాయన్నారు. 1984లో జాతీయస్థాయిలో ప్రవేశపెట్టిన విద్యాపాలసీ వల్లే విద్యలో ప్రైవేటీకరణకు బీజం పడిందని తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహించాయని ఆయన పేర్కొన్నారు.



ఉద్యమ గీతాలాపన చేస్తున్న యూటీఎఫ్ బృందం

పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి

ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తారని, రాష్ట్రంలో ప్రభుత్వ రంగ పాఠశాలలను పరిరక్షించుకోవాలన్నారు. గత ప్రభుత్వం తీరుతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యాయన్నారు. ఉభయ గోదావరిజిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పాటై యాభైఏళ్లు పూర్తి కావడంతో సర్ణోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిందన్నారు. జాతీయ విద్యా విధానం 2020ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, ఇది విద్యారంగంలో మతతత్వాన్ని పెంచేదిగా ఉందన్నారు. అఖిలభారత ఉపాధ్యాయ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. గత ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ట్యాబ్‌లు, బైజూస్ వంటి విద్యావిధానాలు ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని దీంతో రాష్ట్రంలో లక్షన్నరమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. విద్యావ్యవస్థను నాశనం చేసే అన్ని నిర్ణయాలు వైసీపీ ప్రభుత్వం తీసుకుందని విమర్శించారు. సుమారు రూ.31వేలకోట్ల బకాయిలు ఉపాధ్యాయులకు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూటీఎఫ్ యాభైఏళ్ల ఉద్యమాలతో ప్రభుత్వ బడులను కాపాడుకుందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల విద్యావ్యవస్థ కోలుకోని దెబ్బతగిలిందన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి విద్యారంగాన్ని కాపాడుకున్నామన్నారు. తొలుత జాతీయ జెండాను, తర్వాత యూటీఎఫ్ జెండాను, ఎస్‌ఎఫ్‌ఐ జెండాలను సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, టీవీ రాఘవులు, జి.చిట్టిబాబులు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన నాలుగు పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. యూటీఎఫ్ అమరజీవుల స్థూపాన్ని అఖిలభారత ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి ఆవిష్కరించారు. తదనంతరం 16 మహా సభల జాతాల జెండాలను ఆవిష్కరించారు.

కిక్కిరిసిన పీఆర్ ప్రాంగణం

ఈ మహాసభలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి యూటీఎఫ్ ఉపాధ్యాయులు 20వేల మంది హాజరయ్యారు. దీంతో పీఆర్ కళాశాల ప్రాంగణం కిక్కిరిసింది. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, తెలంగాణ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమాదేవి, కాకినాడ ఆర్జేడీ నాగమణి, మాజీ అధ్యక్షుడు జోజయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కుసుమకుమారి, కుమార్‌రాజా, హనుమంతురావు, నాగమ ల్లేశ్వరరావు, అన్నారాం, మనోహర్, జ్యోతి బసుచఅరుణకుమారి ఉన్నారు.

అప్పుడు రజతోత్సవాలు.. ఇప్పుడు స్వర్ణోత్సవ సంబరాలు

యూటీఎఫ్ 25ఏళ్ల రజతోత్సవాలు, 50 ఏళ్ల స్వర్ణోత్సవ మహాసభలకు కాకినాడలోని పీఆర్ కళాశాల వేదికగా నిలిచింది. 25ఏళ్ల క్రితం ఇదే పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యూటీఎఫ్ రజతోత్సవాల సభలు ఘనంగా జరిగాయి. మళ్లీ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణత్సవాలు సభలు ఇక్కడే జరగడం విశేషం.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రౌతులపూడి మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునులు వివిధ గీతాలకు నృత్యాలు చేశారు.

పసందైన వంటకాలతో విందు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు రెండు రాష్ట్రాల నుంచి 20వేల మంది ఉపాధ్యాయులు విచ్చేయగా అందరికీ నోరూరించి పసందైన వంటకాలతో విందు అందించారు. ఎమ్మెల్సీలు గోపిమూర్తి, లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు భోజనాలు వడ్డించారు.

పూల ప్రేమికులకు ఆహ్వానం

» నేటి నుంచి యానాంలో ఫలపుష్ప ప్రదర్శన, ప్రజా ఉత్సవాలు » ప్రత్యేక ఆకర్షణగా 'పుష్ప 2' ఎడ్లబండి, ఎర్రచందనం

యానాం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో పూల ప్రేమికులను ఆహ్లాద పరిచేందుకు యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23వ ఫలపుష్ప ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 22 ఏళ్లుగా ఈ ఉత్సవాలను జనవరి 6 నుంచి 8 వరకూ ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన జరగనున్న ఈ ప్రదర్శనకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, స్పీకర్ సేల్వం, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, వ్యవసాయశాఖమంత్రి జైకుమార్, వివిద శాఖాధికారులు హాజరుకానున్నారు.



సర్వాంగ సుందరంగా ముఖద్వారం



వివిధ రకాల జాతుల ఫలపుష్పాలు



పుష్ప2 సినిమాలో ఉపయోగించిన ఎడ్లబండి, ఎర్రచందనం



వివిధ రకాల జాతుల పుష్పాలతో...

ముఖ్యంగా ఈ ఫల పుష్పప్రదర్శన యానాం, పరిసరప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని చేకూరుస్తుంది. వీటిలో తూర్పు గోదావరి జిల్లాలోని కడియం, రాజమండ్రి, బెంగుళూరు, తదితర ప్రాంతాల నుండే కాకుండా యానాం వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల జాతుల ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచుతారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు స్థానిక వ్యవసాయ శాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వివిధ నర్సరీల నుంచి అనేక రకాల పూల మొక్కలు యానాం చేరుకున్నాయి. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభంకానుంది. 3 రోజుల పాటు జరిగే ప్రదర్శనలో ప్రజలనందరిని ఆకర్షించే విధంగా వివిధ రకాల స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాజశేఖరన్ ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తు సిద్ధం చేశారు. ఈ సంవత్సరం పుష్ప-2 చిత్రంలో హీరో అల్లు అర్జున్ ఉపయోగించిన ఎడ్లబండి, ఎర్రచందనం ప్రత్యేక అర్షణగా ఈ ప్రదర్శనలో నిలవనున్నాయి. ఇప్పటికే డైరెక్టర్ సుకుమార్‌తో మాట్లాడిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి వాటిని ఇక్కడకు తీసుకురావడం జరిగింది. యానాం చేరుకున్న వ్యవసాయశాఖ మంత్రి జైకుమార్‌కు ఢిల్లీ ప్రతినిధి మల్లాడి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రితో కలిసి ఫలపుష్ప ప్రదర్శన కోసం జరుగుతున్న ఏర్పాట్ల పరిశీలించారు. కార్యక్రమంలో యానాం పరిపాలనాధికారి మునిస్వామి, డిప్యూటీ డైరెక్టర్ జె.శివశుభ్రమణియన్, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆవుల అందాల పోటీలు





గిరి ఆవుల అందాల పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఆవు, ఒంగోలు ఆవుల అందాల పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఆవు



ఒంగోలు ఆవుల పాల పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఆవు

మలికిపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కేశనపల్లిలో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవుల అందాల పోటీలు, ఒంగోలు పాల పోటీలు అలరించాయి. రాష్ట్ర పశుసంవర్థకశాఖ, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో అడబాల లక్ష్మీనారాయణ (నాని) నిర్వహించిన ఈ పోటీల్లో 180 వివిధ రకాలకు చెందిన ఒంగోలు, పుంగనూరు, గిరి జాతికి చెందిన ఆవులు, గిత్తలు పాల్గొన్నాయి. పాల పోటీల్లో మండపేటకు చెందిన మల్లిపూడి వెంకట్రావుకు చెందిన ఒంగోలు ఆవు 16.246 కిలోల పాల దిగుబడితో ప్రథమస్థానం పొందగా అదే రైతుకు చెందిన మరో ఆవు 14.206 కిలోల పాల దిగుబడితో ద్వితీయ బహుమతి పొందింది. ఏలూరుకు రామశింగవరం సర్పంచ్ అడపా శ్రీనివాసరావుకు చెందిన ఒంగోలు ఆవు 14.766 కిలోల దిగుబడితో తృతీయ స్థానం పొందింది. ఒంగోలు ఆవుల అందాల పోటీల్లో ఏలూరు జిల్లా రామశింగవరానికి చెందిన అడపా శ్రీనివాసరావుకు చెందిన ఆవు ప్రథమ స్థానం, ముత్యాల విజయకిరణ్‌కు చెందిన ఆవు ద్వితీయ స్థానం, ముప్పాళ్ల నాగేశ్వరరావుకు చెందిన తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించాయి.

పుంగనూరు ఆవుల అందాల పోటీల్లో భీమవరానికి చెందిన బర్రెడ్డి మణికంఠసతీష్‌కు చెందిన పుంగనూరు ఆవు ప్రథమస్థానం పొందగా కోనసీమ జిల్లా మాచవరానికి చెందిన అడబాల ప్రేమ్‌కుమార్ ఆవు ద్వితీయస్థానం, మండపేటకు చెందిన వి.చక్రవర్తికి చెందిన ఆవు తృతీయ స్థానంలో నిలిచాయి. గిరి ఆవుల అందాల పోటీల్లో భీమవరానికి చెందిన బర్రెడ్డి మణికంఠసతీష్‌కు చెందిన ఆవు ప్రథమస్థానం, లక్కవరానికి చెందిన రుద్రరాజు బుజ్జిరాజు ఆవు ద్వితీయ స్థానం, లక్కవరానికి చెందిన అల్లూరి పృధ్విరాజ్‌కు చెందిన ఆవు తృతీయ స్థానాలు సాధించాయి. పుంగనూరు గిత్తల అందాల పోటీల్లో మాచవరానికి చెందిన అడబాల ప్రేమకుమార్‌కు చెందిన గిత్తకు ప్రథమస్థానం, గుమ్మిలేరుకు చెందిన రెడ్డి వీరవెంకటసత్యనారాయణ గిత్తకు ద్వితీయస్థానం, పడమటిపాలేనికి చెందిన గుండాబత్తుల మధుకు చెందిన గిత్తకు తృతీయస్థానం లభించాయి. పోటీల్లో పాల్గొన్న వివిధ రకాల ఆవులను పది విభాగాలుగా విభజించి అన్ని విభాగాల్లోను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అడబాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సభలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు మాట్లాడుతూ పాడి పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీలను ఏర్పాటుచేసిన నానినీ అభినందించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యెనుముల నాగు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, నర్సాపురం ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, ఎన్డీఏకు నాయకులు పాల్గొన్నారు. విజేతలకు రూ.6లక్షల 50వేలు విలువైన నగదు బహుమతులను అందించారు.

రోడ్డు ప్రమాదంలో సబ్ ఎడిటర్‌కు తీవ్రగాయాలు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ప్రముఖ దిన పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్న జె.ప్రభాకరావు తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం లాలాచెరువుకు చెందిన ప్రభాకర్‌రావు ఒక ప్రముఖ దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌వీజీ మార్కెట్‌కు బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో తిలక్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి ఒక స్కూటీపై యువకుడు అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ప్రభాకర్‌రావు తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో ప్రభాకరరావు కోమలో ఉన్నారు. ఆసుపత్రి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈమేరకు ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మరణించిన సూర్యనారాయణ

పిఠాపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మరణించాడు. పట్టణంలోని కత్తులగూడెంకు చెందిన బాదం సూర్యనారాయణ(63) కొన్నేళ్లుగా పాతబస్టాం డు వద్ద గల హెచ్‌పీ బంకులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బంకు నుంచి ఇంటికి వెళ్లేందుకు సైకిల్‌పై బయటకు రాగా తుని నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో సూర్యనారాయణ అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య, కుమారుడు లింగమూర్తి ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో గౌరవంగా మెలగాలి

ప్రధానాలయాల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ కమిషనర్

అన్నవరం జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి ఆలయాలకు విచ్చేసే భక్తుల పట్ల సిబ్బంది గౌరవంగా మెలగడంతో పాటుగా వారికి కావలసిన సమాచారాన్ని అందించాలని దేవదాయ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ప్రధానాలయాల సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడగా అన్నవరం ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి భక్తుడు నుంచి ఫోన్ల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతుందని దీనిని సీఎంవో కార్యాల యం మోనటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుందన్నారు. దర్శనం నుంచి సత్రంగదు లు, అన్నదానంతో పాటుగా ప్రతీ విభాగం నుంచి భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఆయా సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. ప్రతి చోట ఫిర్యాదుల బుక్‌లు, ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నెంబర్లు ఉంచాలని సీఎంవో కార్యాలయం నుంచి సదరు భక్తుడికి ఫోన్‌కాల్ వెళ్తుందని ప్రతీ సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తదనుగుణంగా చర్యలుంటాయని తెలిపారు. ప్రసాదం నాణ్యత పెంపు, అన్నదానంలో రుచికరమైన భోజనం అం దించడంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించకూడదని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ సీహెచ్. రామ్మోహనరావు, ఏఈవోలు కృష్ణారావు, ఎల్.శ్రీని వాస్, పాలంకి జగ్గారావు, కొండలరావు, ఇంజనీరింగ్ అధికారులు, సూపరెంటెండెంట్‌లు తదితరులున్నారు.

స్వామి,అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు

అన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు, క్షేత్రపాలకులు సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు విశాఖపట్నానికి చెందిన శ్రీరామ్‌తేజ్ దంపతులు నూతన పట్టువస్త్రాలను ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు ఇంద్రగంటి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం ఆలయంలో పట్టు వస్త్రాలను ఈవోకు అందజేస్తున్న దాత



మోగిన శంఖం


కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు







సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద

హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



రాజమహేంద్రవరం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఇంటర్ విద్యార్థికి రేబిస్ చికిత్స

సీతానగరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ర్యాబిస్ వ్యాధితో రఘుదేవపురం గ్రామానికి చెందిన ఒక యువకుడు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న 17 ఏళ్ల విద్యార్థికి రేబిస్ సోకింది. కుటుంబీకులు జీజీహెచ్ కాకినాడకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.



ముగ్గుల పోటీల్లో భాగంగా హరిదాసులకు కొత్త దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

మహిళలను ప్రోత్సహించేందుకే ముగ్గుల పోటీలు

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సంక్రాంతి పండుగకు మహిళలను ప్రోత్రహించేందుకే ప్రతిష్ఠాత్మకంగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగరంలో ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో 6, 21, 22, 23, 24, 25, 31 డివిజన్లలో స్థానిక కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని ముగ్గులు పెట్టారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ముగ్గులను పరిశీలించారు. అనతరం పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ వేడుకల్లో హరిదాసుకు బట్టలు పెట్టారు. ఈనెల 11న పుష్కరాల రేవులో జరిగే సంక్రాంతి సంబరాలలో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లం శ్రీను, తవ్వారాజా, మజ్జి రాంబాబు, యిన్నమూరి దీపు, మాలే విజయలక్ష్మి, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో జాగ్రత్త చంద్రబాబు

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ విషయంలో సీఎం చంద్రబాబు జాగ్రత్తగా ఉండాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. ఆదివారం రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరాని తనాన్ని ఎదుర్కొన్నవారు ఎస్సీలు, వివక్షతను ఎదుర్కొన్నవారు ఆనాడు మహాత్మాగాంధీ కృషి వల్లనైతేనేమీ, కాంగ్రెస్‌పార్టీ కృషి వల్లనైతేనేమీ ఎస్సీలయ్యారని చెప్పారు. ఆనాడు అంటరాని వారికి రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్‌పార్టీ అని అన్నారు. ఇప్పుడు వర్గీకరణపై తీర్పు ఇచ్చిన ఏడుగురు జడ్జిలలో ఏఒక్కరికీ అంటరాని తనం తెలియదని, సుప్రీంకోర్టులో ఉన్న 35మంది జడ్జిలలో ఒక్కరు కూడా ఎస్సీ కాలనీలలో తిరగలేద ని చెప్పారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇస్తే దానిని మన పక్కరాష్ట్రం తమిళనాడు సీఎం ఎం.స్టాలిన్ పక్కన పడేశాడని, కేరళ సీఎం విజయన్ చాలా అనుభవజ్ఞుడు నేర్పరి అతను కూడా జడ్జిమెంట్ కాపీని విసిరిపారేశాడని, కానీ మనరాష్ట్రంలో చంద్రబాబు కమిటీ వేయడం దారుణమన్నారు. కమిషన్ చైర్మన్‌గా యూపీకి చెందిన ఐఏఎస్‌ను వేశారన్నారు. ఆ చైర్మన్ రాష్ట్రంలోనే జడ్జిమెంట్ కాపీ గురించి పట్టించుకోలేదన్నారు. ఎస్సీలను విభజించాలను కోవడం సరికాదని స్పష్టం చేశారు. ఎస్సీల సెన్సెస్ ఏపీలో తీశారని అస్సలు సెన్సెస్ తీసే అధికారం ఢిల్లీలో ఒక అధికారి ఉంటాడని ఆయనకే సెన్సెస్ తీసే హక్కు ఉంటుందని మిగిలిన వారికి ఉండదని చెప్పారు. సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ మానుకోకపోతే ఎస్సీలంతా రోడ్డుపైకి వస్తారు. పరిస్థితి పూర్తిగా మారుతుందని ఏపీలో ఏమవుతుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇక ఇరిగేషన్ ప్రాజెక్టులు రాజకీయ నాయకులకు కాసుల పంట పండిస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టుకు రూ.50వేల కోట్లు ఖర్చుచేశారని ఇందులో కుడి ఎడమకాలువలకు రూ.25వేలకోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఇంకా 25వేల కోట్లు బిల్లులు రావాల్సి ఉందన్నారు. పోలవరంపై రాజకీయ నాయకులు డబ్బుల సంపాదిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ జరపాలన్నారు.

ఐదుగురిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని మోరంపూడి సమీపంలో ఒకమహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బొమ్మూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకివెళితే.. 30ఏళ్ల వయస్సు గల ఒక మహిళ మోరంపూడిలో నివాసం ఉంటుంది. ఆమె ఎస్‌వీజీ మార్కెట్‌లో కిరాణా దుకాణంలో పనిచేస్తూ ఒక వ్యక్తితో సహజీవనం చేస్తుంది. వీరిని అదే ప్రాంతానికి చెందిన ప్రశాంత్‌కుమార్, మనోజ్, సురేంద్ర, వంశీ, రమేష్ అనే ఐదుగురు వ్యక్తులు గమనిస్తున్నారు. ఈ నెల 3న రాత్రి మహిళ తాను సహజీవనం చేస్తున్న వ్యక్తితో ఉండగా ఐదుగురు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఆ వ్యక్తిని భయపెట్టి బయటకు గెంటేసి ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించారు. దీంతో ఆమె కేకలు వేసి బయటకు రావడంతో వారు పారిపోయారు.ఈ మేరకు బాధితురాలు బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హైందవ శంఖారావానికి తరలిన జనం



హైందవ మహాసభకు బయలుదేరుతున్న దృశ్యం

కడియం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కడియం మండలం నుంచి హైందవ మహాసభకు 11 బస్సులు, 25 కార్లలో వెయ్యి మంది వరకు వెళ్లారని. భారతీయ జనతాపార్టీ రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, మండల అధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు మండలంలో వివిధ ఆలయ కమిటీల సభ్యులు హైందవ మహాసభకు బయలుదేరారు. పలువురు మాట్లాడుతూ హిందువుల ఆస్తులు పరిరక్షించాలని కోరారు.

అబ్బులు సేవలు
అభినందనీయం

రాజానగరం జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోస్టాఫీస్‌లో డాక్ సేవక్‌గా ప్రత్తి అబ్బులు సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు అన్నారు. డాక్ సేవక్ ప్రత్తి అబ్బులు పదవీ విరమణ సత్కార సభ రాజానగరం పోస్టాఫీస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గండేపల్లి పోస్టుమాస్టర్ లింగయ్య హెడ్ పోస్టాఫీస్ హెడ్ పోస్ట్‌మాస్టర్ సువర్ణరాజు, ఎస్సీఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, టిఎస్‌ఎన్ రెడ్డి, తాతాజీ, హనుమాన్, భాస్కర్,అశోక్, సుందర్‌రాజు, ఎన్‌ఎఫ్‌పీఈ కొండబాబు, ఏఐజీడీఎస్ యూనియన్ నాయకులు భూలోకం, రమణ, శ్రీనివాస్, కుమారస్వామి, రామకృష్ణ, రాజబాబు, రాజానగరం, గండేపల్లి, జీఎస్‌ఎల్ సబ్‌పోస్టాఫీస్ ఎస్‌పోలు, బీపోలు సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ముగ్గుల పోటీలు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో స్థానిక లలితానగర్ దత్తసాయి కర్రీపాయింట్ వద్ద ఆదివారం సాయంత్రం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లబ్ రీజియన్ చైర్మన్ నూలు స్వామి, అతిథులుగా ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ శీగాకొల్లి కరుణ కుమార్, ఫాస్ట్ గవర్నర్ బాలనాగు కాశీవిశ్వేశ్వరరావు, జోన్ చైర్మన్ నాగసాయిలక్ష్మిలు హాజరయ్యారు. ఈ పోటీలను క్లబ్ అధ్యక్షురాలు సిగాకొల్లి శైలజ అధ్యక్షతన, సెక్రటరీ కారుమూరి మురళీకృష్ణ, ట్రెజరర్ కుమ్మరగుంట్ల లక్ష్మీకాంతంల పర్యవేక్షణలో జరిగాయి. 25 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. 8 మంది విజేతలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బచ్చు సూర్యనారాయణమూర్తి, తమ్మన ప్రకాష్, కుమ్మరగుంట్ల వీరభద్రరావు, వక్కలగడ్డ త్రిమూర్తులు, నూలు అనురాధలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ నూలు స్వామి

వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార ఉత్సవం ఆదివారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనంద్ గార్డెన్స్‌లో జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 103పాస్ట్ గవర్నర్ మాచవరపు భాస్కరరావు నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు శనపతి వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు), కార్యదర్శిగా గుబ్బల గంగాభవాని, కోశాధికారిగా ఉప్పులూరి కాశీవిశ్వనాధం, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజరు మనోజ్ఞలు క్లబ్ సేవలను ప్రశంసించి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా 85 మంది వృద్ధులకు రూ.40500నగదు, పింఛన్లుగాను, పేదవిద్యార్థికి రూ.15వేలు సాయంఅందించారు. డీఎస్ కళావతి, రాజారత్నం దంపతులు చీరలుపంపిణీ చేశారు.

జాతీయస్థాయి పోటీ పరీక్షలపై అవగాహన

కడియం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కడియం గిరజాల కృష్ణప్రసాద్ కళ్యాణ మండపంలో విద్యార్థుల తల్లిదండ్రులకు జాతీయస్థాయి పోటీ పరీక్షలు జేఈఈ (ఐఐటీ), నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని విచ్చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ అకాడమీ సీఈవో తులసీరామ్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో విజేతగా నిలవాలంటే విషయ పరిజ్ఞానంతో పాటు ఒత్తిడిని అధిగమించే సత్తా ఎవరికైతే ఉందో వారే విజయాన్ని అందుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మయుక్తా స్కిల్ సెంటర్ డైరెక్టర్ ఆచంట అనురాధ, ఎన్ఆర్ ఐ.రాజమహేంద్రవరం బ్రాంచి ప్రిన్సిపాల్ ఈత కోట మురళీకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ అకాడమీ సీఈవో తులసీరామ్

సరస్వతీ ఘాట్‌లో స్వచ్ఛ భారత్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు 48 మంది గోదావరి జలాలను శుభ్రంచేసి ప్లాస్టిక్ పదార్థాలను, చెత్త వ్యర్థాలను తొలగించారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆలయ స్తంభాలను గుడ్డతో తుడిచి వలంటీర్లు, స్వచ్ఛందంగా సేవ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కమిషనర్, విశ్రాంత ఆర్డీవో ఎం. జితేంద్ర, డైరెక్టర్ ఎస్వీ గంగిరెడ్డి, ఎన్.ఎస్.ఎస్. సభ్యులు పీవీఎస్ కృష్ణారావు, జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు హాజరయ్యారు. జీవీఎస్ నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి సారథ్యం వహించగా, బీహెచ్ రమాదేవి, పి.సాయి, శిరీష, పాల్గొన్నారు.



సరస్వతీ ఆలయంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న సేవకులు



టీటీడీ కల్యాణ మండపంలో వేద ఘోష నిర్వహిస్తున్న పండితులు

వేద ఘోషతో పులకించిన అనపర్తి

అనపర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని ఉమా రామలింగేశ్వర వేద శాస్త్ర పరిషత్ 32వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపంలో వేద గోష్ఠి నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన వేద పండితులు పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు. లోక కల్యాణం కోసం వేద పరిషత్ ప్రతి యేటా వేద గోష్ఠి నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. వేద పండితులు నాలుగు వేదాలను పారాయణం చేశారు. వేద పండితులు భక్తులకు వేదోక్త ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా అనపర్తి వేదఘోషతో పులకించింది. నల్లమిల్లి బాలమురళీకృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరామారెడ్డి సోదరుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేద పండితులకు వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ యు. సత్యనారాయణ అవధాని అధ్యక్షతన వేద పండితులు నాలుగు వేదాలను పఠనం చేశారు. కార్యక్రమంలో తమలంపూడి చిన ఆదిరెడ్డి, కొవ్వూరి రఘునాధరెడ్డి, మారెళ్ళ ఫణికుమార్, రెడ్డి సురేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ

పురాణ గాథల ఆకళింపుతో మంచి నడవడిక ఉండాలి

బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ

అనపర్తి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పురాణ గాథల ఆకళింపుతో మంచి నడవడిక అలవర్చుకోవాలని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. అనపర్తిలోని టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆయన ఆంధ్ర మహాభాగవతంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మహాభాగవతం నుంచి ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ప్రవచనం చేశారు. న్యాయవాది వీవీఆర్ చెల్లయ్యబాబు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన ఆదిరెడ్డి, కొవ్వూరి రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం సభకు హాజరైన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి



సీతానగరం నుంచి హైందవ శంఖారావానికి వెళుతున్న హిందువులు

హైందవ శంఖారావ సభకు జనం



రంగంపేటలో జెండా ఊపి బస్సుయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ హైందవ శంఖారావ సభకు అనపర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో హిందువులు వెళ్లారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల నుంచి సుమారు 70 బస్సుల్లో అక్కడికి వెళ్లారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో సూర్యనారాయణమూర్తి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. బస్సుల్లో వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కూటమి నాయకులు ఆహార పొట్లాలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. బస్సుల్లో వెళుతున్న వారిని అనుసరిస్తూ ఎమ్మెల్యే కూడా వారి వెంట విజయవాడ సభా వేదికకు చేరుకుని శంఖారావంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు కె.బులిరెడ్డి, కూటమి నాయకులు ఎస్.దేవదానరెడ్డి, కె.శేషారత్నం తదితరులు ఉన్నారు.

బిక్కవోలు: విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభకు బిక్కవోలు నుంచి 150 మంది మూడు బస్సుల్లో వెళ్లారు. వీరికి స్థానిక ఓంశాంతి ఆశ్రమ వ్యక్తులు పులిహోర పొట్లాలు అందించారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓంశాంతి వ్యక్తులు లక్ష్మి, భాగ్యలక్ష్మి, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో హిందువులు వెళ్లారు. ప్రైవేట్ బస్సులు, కార్లు, ఆర్టీసీ బస్సుల్లో వారంతా అక్కడికి తరలి వెళ్లారు. సమసత ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ కె. అభిలాష ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులో వెళారు. అక్కడి కార్యక్రమానికి సుమారు 6 వేల మంది వరకు వెళ్లి ఉండవచ్చునని తెలిసింది.

రంగంపేట: విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావం సభకు అనపర్తి నియోజకవర్గంలో గల పెదపూడి, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట నాలుగు మండలాల నుంచి వెళుతున్న బస్సులకు ఎస్టీరాజాపురంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జెండా ఊపి బస్సుయాత్రను ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు అక్కడకు వెళ్లడం విశేషం.

యువ రైతుకు అభ్యుదయ రైతు పురస్కారం



రాంబాబును సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రాజానగరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో పలు రకాల కూరగాయలు, పంటలు సాగుచేస్తూ అందరి మన్ననలు అందిపుచ్చుకుంటున్న నరేంద్రపురం గ్రామానికి చెందిన యువ రైతు ప్రగడ రాంబాబుకు అభ్యుదయ పురస్కారం లభించింది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహించిన సంక్రాంతి సంబరాలు, అభ్యుదయ రైతులకు పురస్కారాల ప్రధానోత్సవంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు నుంచి పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి హాజరైన 250 మంది అభ్యుదయ రైతు దంపతుల్లో రాంబాబు ఒకరు కావడం విశేషం. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, వీసీ ఆచార్య నాగభూషణం, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.



ఐశ్వర్య రవ్వను ప్రారంభిస్తున్న సినీ నటి రేణూదేశాయ్, ఐశ్వర్య మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్

ఐశ్వర్య ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

సినీ నటి రేణూదేశాయ్

రాజానగరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఐశ్వర్య ఆహార ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సినీనటి రేణూదేశాయ్ పేర్కొన్నారు. రాజానగరం సమీపంలోని ఐశ్వర్య గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ నూతన ఉత్పత్తులైన రవ్వ రకాలను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఐశ్వర్య బ్రాండ్ నూతనంగా ఇడ్లీ రవ్వ, వరి నూక వంటివి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తమ సంస్థ తయారు చేసే ఉత్పత్తుల్లో ఆరోగ్యానికి సంబంధించిన అనేక రకాల పోషకాలు దాగిఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ డీజీఎం ప్రమోద్‌కుమార్, ఐశ్వర్య గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ జొన్నాడ సత్యనారాయణ, డైరెక్టర్ మోహనకృష్ణ, జీఎం లక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోషులపై కేసు నమోదు చేయాలి



అనిల్ కుమార్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు అభిరామ్ తదితరులు

సీతానగరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి ఫ్లెక్సీలు కడుతున్న తెలుగుదేశం కార్యకర్తను కొంతమంది బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై వెంటనే కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు పెందుర్తి అభిరామ్ కోరారు. ఆదివారం ముగ్గుళ్ళ గ్రామంలో బాధితుడు గెడ్డం అనిల్‌ను కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులు చేయడం తెలుగుదేశం సంస్కృతి కాదన్నారు. అందు వల్లే చట్టపరంగా న్యాయం చేయమని కోరుతున్నామన్నారు. పోలీస్ వ్యవస్థపై నమ్మకం ఉందని వారు అన్నారు. దాడి చేసిన వారిలో ఒకరు గతంలో క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఈ విషయం మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. ఈ సంఘటనపై న్యాయం జరిగే వరకు పోరాడతామని పై అధికారులు దృష్టికి తీసుకువెడతామన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.




వామన అవతారంలో శ్రీభజేనారాయణుడు

వామన అవతారంలో భజేనారాయణుడు

రంగంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో దశావతార ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వామన అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీభజేనారాయణస్వామి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు చిలకమర్తి మురళీకృష్ణమాచార్యులు,శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేసారు.

జాతీయ వాలీబాల్ పోటీల్లో ఏపీ జట్టుకు ఇద్దరు ఎంపిక




ఎంపికైన గోపిరెడ్డి వెంకట శివ, ఎస్.సుధీర్ కుమార్

సీతానగరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీ నుంచి రాజస్థాన్ జైపూర్‌లో అడ్‌హక్ కమిటి (వాలీబాల్ ఫెడరే షన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించే 69 వ జాతీయ సీనియర్ వాలీబాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టుకు తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు సీతానగరం గ్రామానికి చెందిన వాలీబాల్ కోచ్, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు కొండ్రపు వీర వెంకట సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కోరుకొండ మండలం, గాడాలకు చెందిన గోపిరెడ్డి వెంకట శివ, పెదపూడికి చెందిన ఎస్.సుధీర్ కుమారు ఎంపికైనట్లు తెలిపారు. 2020 తరువాత వాలీబాల్ అసోసియేషన్లకు గుర్తింపు లేదని ఇప్పుడు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో అధికారికంగా జరుగుతున్న ఈ చాంపియన్ షిప్‌లో ఇచ్చే సర్టిఫికెట్లుకు గుర్తింపు ఉంటుందన్నారు. తద్వారా క్రీడాకారుల స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు పొందడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

సారా స్థావరాలపై దాడి

600 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం

రంగంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించగా మూడు ప్లాస్టిక్ డ్రమ్ముల నాటుసారా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసామని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




కాకినాడలో ఆదివారం ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలతో అతిథులు ఎమ్మెల్సీ పద్మశ్రీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కమిషనర్ భావన తదితరులు

కాకినాడ జిల్లా



కోనసీమ జిల్లా



తూర్పుగోదావరి జిల్లా



ముగ్గుల పండగ

'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగ ముందే వచ్చే సింది.. ముగ్గులతో కళ తెచ్చేసింది.. సంక్రాంతి పండుగ ముందు రావడం ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారా.. అదే మరి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రత్యేకత.. తెలుగింట సంప్రదాయంలో భాగంగా ప్రతి ఏడాది 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సంక్రాం తి పండుగను తలపిం చేలా ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం షిర్డిసాయి విద్యానికేతన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం ముగ్గుల పోటీ లు నిర్వహించారు.కాకినాడ జిల్లాలో మెక్‌లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివా రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. ఉత్సాహంగా ముగ్గులు వేశారు.ఆయా ప్రాంగణాలు భువిపై చుక్కలు దిగివచ్చా యా అన్నట్టు మెరిశాయి..మహిళలు ఒకరికొకరు పోటాపోటీగా ముగ్గులు వేశారు. బహుమతులకు ముగ్గులను ఎంపిక చేయడం న్యాయనిర్ణేతలకు సవాల్‌గా మారింది. మూడు జిల్లాల్లోనూ మూడేసి చొప్పున బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి విజేతకు రూ.6 వేలు ..ద్వితీయ బహుమతి విజేతకు రూ.4 వేలు..తృతీయ బహుమతి విజేతకు రూ.3 వేలు అందజేశారు. ఇవి కాక పెద్ద ఎత్తున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలకు హాజరైన ప్రతి ఒక్కరికి బహుమతి ఇచ్చి పంపారు.. పోటీలకు హాజరైన పలువురు మహిళలు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల కోసం ఏడాదంతా ఎదురుచూస్తూనే ఉంటామని చెప్పడం గమనార్హం. కొందరైతే తెలుగు సంప్రదాయాన్ని గుర్తు చేస్తున్న 'ఆంధ్ర జ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు. ఎందుకంటే నాడు పట్టణమైనా..పల్లె అయినా ధనుర్మాసం ఆరంభం నుంచి ముగిసే వరకూ ముగ్గులతో వీధులన్నీ కళకళలాడేవి.. రోగాలను దూరం చేసేవి..నేడు రోగాలు పెరి గాయి..ముగ్గులు తగ్గాయి. కాలంతో పాటు జీవన విధానంలోనూ మార్పులు వచ్చాయి.. ఒకనాడు టీవీ.. నేడు సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు..ఈ విధానం మారాలి.. మళ్లీ ఆ పాత సంప్రదాయాన్ని తట్టి లేపడానికే 'ఆంధ్రజ్యోతి' ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది.

చుక్కల ముగ్గు.. లెక్క తేల్చగలరా?

చుక్కలు రంగులద్దుకున్నాయి.. పువ్వు లుగా మారాయి.. అక్షరాలయ్యాయి.. ఒక రూపాన్ని సంతరించుకున్నాయి.. అందాన్ని ఆనందాన్ని పంచాయి.. అదె లాగంటే.. అదే మరి ముగ్గు ప్రత్యేకత.. 21 చుక్కలు అటూ ఇటూ.. 21 అడ్డం.. 21 నిలువు అనమాట.. చూసే వారికి ఏం అర్థం కాదు.. ఒక అరగంట ఆగి చూశామా.. ఆ చుక్కలన్నీ రకరకాల రూపాలను సంత రించుకుంటాయి. చుక్కలు ఎక్కడున్నాయో కనిపెట్టడం కష్టమే.. ఇదీ ముగ్గు ప్రత్యేకత.. నేటి కంప్యూటర్‌తరం కూడా విడదీసి చెప్ప లేని లెక్క ఇది.. ఒక్క మహిళలకు మాత్రమే అర్థమయ్యే లెక్క.. తెలుగింట సంప్రదాయం ముగ్గు..


ముగ్గు వేస్తున్న తూర్పు కలెక్టర్ ప్రశాంతి


చుక్క..చుక్క కలిపి

ఈ చుక్కలెన్నో చెప్పగలరా.. ఎక్కడున్నాయో విప్పగలరా.. చెప్పడం కష్టమే కదా.. కాకినాడకు చెందిన పోతుల సునీత ఇలా చుక్కలు ముగ్గు వేసి.. మొదటి బహుమతి సాధించారు.


ముగ్గులోలికే..

ముగ్గు చూస్తుంటే చూస్తూనే ఉండి పోవాలనిపిస్తుంది కదూ.. అదే మరి ముగ్గు ప్రత్యేకత. రావులపాలెంనకు చెందిన వి.సావిత్రి అమలాపురంలో నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి సాధించారు.


పండుగొచ్చింది!

ముగ్గు చూస్తుంటే సంక్రాంతి పండుగ వచ్చేసినట్టుంది కదూ.. అదే ఈ ముగ్గు ప్రత్యేకత.. రావుపాలెంనకు చెందిన గిరి అమ్మాజీ రాజమండ్రిలో నిర్వహించిన పోటీల్లో ముగ్గు వేసి ప్రథమ బహుమతి సాధించారు.


ఏపీ పేపరుమిల్లు కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఇతర ఎమ్మెల్యేలు

పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేస్తాం

సీఎం చంద్రబాబు ఆదేశాలు - కార్మికులతో ఎమ్మెల్యేల చర్చలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు రాష్ట్ర పరిశ్రమల ముఖ్యకార్యదర్శి కార్తికేయ మిశ్రాకు ఆదేశాలు ఇచ్చారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లులో సమ్మెకు దిగిన కార్మికులతో ఆదివారం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ సమావేశమయ్యారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రజాప్రతినిధులు మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కయి సూట్ కేసులు అందుకుని కార్మికులను రోడ్డున పడేశారని విమర్శించారు. అందుకే కార్మికులంతా ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరునెలలుగా పరిస్థితిని అర్థం చేసుకుంటున్నామన్నారు. సమస్యను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. స్పందించిన సీఎం కార్మికులకు మంచి ఒప్పందం చేయాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. ఇలాంటి సమయంలో కార్మికులు ఇంకా ఆందోళనకు కూర్చుంటే ప్రతిపక్షనాయకులు, కొందరు కార్మిక నాయకులు వారి స్వార్థం కోసం మిమ్మల్ని తప్పుదోవ పట్టించే అవకాశం ఉందన్నారు. వారికి ఆ అవకాశం ఇవ్వొద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేస్తుందన్నారు. కార్మికులకు మంచి అగ్రిమెంట్ అందించేందుకు సీఎం చంద్రబాబు పరిశ్రమల అధికారులకు ఆదేశాలు ఇచ్చారని..ఆందోళన చెందవద్దని చెప్పారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు,వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధ, బుడ్డిగ రవి,దినేష్ పాల్గొన్నారు.

జూద క్రీడలు నిర్వహించొద్దు ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా జూద క్రీడలు నిర్వహించినా ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు.ఈ మేరకు ఆదివారం జిల్లాలో పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పేకాట గుండాట కోడిపందాలు నిర్వహించే ప్రాంతాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. పాత నేరస్తులపై బైండోవ కేసులు పెట్టాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు కోడిపందాలు, ఇతర నిషేధిత ఆటలపై డయల్ 112 కు సమాచారం అందించాలన్నారు.

చిన్నారుల ఆధార్‌కు డ్రైవ్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 0-6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు ఆధార్ నమోదు కార్యక్రమానికి సోమవారం నుంచి 10వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు.జిల్లాలో సుమారు 17 వేల మంది ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారన్నారు.ఆధార్ నమోదు సమయంలో చిన్నారుల పేరుతో ఉన్న పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకుని తండ్రి / తల్లి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరుతో ఆధార్ నమోదు చేసే సిబ్బందిని కలసి ఎన్‌రోల్ చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్న సంబంధిత ఉద్యోగులకు, సిబ్బందికి ఎటువంటి సెలవులు ఇవ్వవద్దని ఆదేశించారు.


యూటీఎఫ్ సంబరం

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో ఆదివారం ఘనంగా ఆరంభమయ్యాయి. పీఆర్ కళాశాలలో జరిగిన వేడుకలకు 20 వేల మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.. ముందుగా జాతీయ పతాకాన్ని, యూటీఎఫ్, ఎస్టీఎఫ్ఐ జెండాలను సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, బీవీ రాఘవులు, జి.చిట్టిబాబు ఆవిష్కరింపజేశారు.సభలో టీచర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కాలనీలు చూస్తే... ఆగవు కన్నీళ్లు!


వెలుగుబంద కాలనీలో పెరిగిన తుప్పలు

జగనన్న కాలనీల చుట్టూ సమస్యలే

- గత ప్రభుత్వంలో పట్టని వైనం
- మొదటి దశలో 62,624 ఇల్లు
- 26,179 ఇళ్లు మాత్రమే పూర్తి
- మిగిలిన వాటి సంగతి అంతే
- ముందుకు సాగని నిర్మాణాలు
- యజమానుల ఇబ్బందులు
- అప్పుల పాలైన పేదలు
- నేటికీ తేరుకోని వైనం
- ఇళ్ల నిర్మాణాలపై కూటమి దృష్టి
- ఇప్పుడిప్పుడే కదులుతున్న వైనం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
జగనన్న కాలనీల పేరు చెబితే సమస్యలే గుర్తొస్తాయి.. గత ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లిస్తామని జిల్లాలో 429 లేఅవుట్లు వేసి మొదటి దశ కింద 45,051 ఇళ్లు,సొంత స్థలాలు ఉన్న వారికి 17,573 ఇళ్లు మంజూరు చేశారు. వైసీపీప్రభుత్వం ఓట్ల కోసం హడావుడి చేసింది తప్పితే నివాసయోగ్యంగా మాత్రం చేయలేదు. కాలనీల్లో కనీసం రోడ్లు లేవు.. డ్రైనేజీలు లేవు.. మంచినీటి సదుపాయమూలేదు..స్థలాలు అయినా బాగున్నాయా అంటే అదీ లేదు. ఊరికి దూరంగా పొలాల మధ్య, కొండల ప్రాంతం, పల్లపు ప్రాంతాలు.. శ్మశానాల చెంత లేఅవుట్లు వేశారు.. లేఅవుట్లను మెరక చేయలేదు.కొన్ని లేఅవుట్లు కాగితాలపైనే ఉన్నాయి.భూ సేకరణలో అవినీతికి పాల్పడ్డారు. చివరకు ఇల్లు కట్టుకోకపోతే స్థలం తీసేసుకుంటామని భయపెట్టారు. తప్పని పరిస్థితుల్లో చాలా మంది అసౌకర్యాల మధ్యే ఇళ్లు కట్టుకున్నారు. దీంతో చాలా ఇళ్లు పునాది దాటలేదు. పేదింట అప్పులు మిగలడంతో లబోదిబోమంటున్నారు.

జిల్లాలో 429 లేఅవుట్లు

జిల్లావ్యాప్తంగా 429 లేఅవుట్లు వేశారు. 62, 624 ఇళ్లు మంజూరు చేయగా 45,051 శాంక్షన్ అయ్యాయి.వాటిలో కేవలం 12,264 పూర్తయ్యాయి. సొంత స్థలం ఉన్న వాటిలో 17,573కి 13,915 పూర్తయ్యాయి. ఇంకా 2360 పునాదులే తవ్వలేదు.ఇక లేఅవుట్లలో 15,489 మొదలు కాలేదు.ఇలా జిల్లాలోని లేఅవుట్లు, సొంత స్థలంలో శాంక్షనైన ఇళ్లలోనే 17,849 ఇంకా మొదలు కాని పరిస్థితి ఏర్పడింది.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజమహేంద్రవరం నగర ప్రజలకు రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలో 13 వేల మందికి పట్టాలు ఇచ్చారు. సుమారు 11 వేల ఇళ్లను అక్కడ మంజూరు చేశారు. 2856 ఇళ్ల నిర్మాణం సాగింది. అందులో 1600 శ్లాబ్ వరకూ వచ్చాయి. ప్రస్తుతం అక్కడ 70 కుటుంబాలు గృహ ప్రవేశాలు చేసుకున్నాయి. సుమారు 1000 ఇళ్ల వరకూ అసలు పునాదులు వేయలేదు. కొన్ని పునాదుల్లోనే ఆగిపోయాయి. వాటిలో మొక్కలు,తుప్పలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసింది.మార్చి నాటికి మరో 70 ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగే అవకాశం ఉన్న ట్టు అధికారులు చెబుతున్నారు.మిగిలినచోట్ల ఇప్పుడిప్పుడే ఇంటి నిర్మాణానికి ముందుకొస్తున్నారు.

మౌలిక సదుపాయాల్లేవు

జిల్లాలో చాలా లేఅవుట్లలో మౌలిక వసతుల్లేవు. లేఅవుట్లు మెరక, పల్లాలు కూడా సరిచేయకుండా వదిలేశారు.రోడ్లు,విద్యుత్, మంచినీటి సౌకర్యాలు లేవు. డ్రైనేజీ సౌకర్యం లేదు. రవాణా సౌకర్యం పెద్ద సమస్యగా ఉంది. ఎందుకంటే ఎక్కడెక్కడో మారుమూల ప్రాంతాల్లో లేఅవుట్లు వేయడంతో ప్రస్తుతం ఇబ్బందిగా మారుతోంది. వెలుగుబందలో కనీసం రోడ్లు కూడా వేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టర్ పి.ప్రశాంతి పలుదఫాలు వెలుగుబంద కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిపై ఆరా తీసి మెరుగుపరిచే ఆలోచన కూడా చేస్తున్నారు.




జగనన్న కాలనీలో కానరాని రోడ్డు

జగనన్న మోసం గురూ!

వేలాది మందిని పట్టాల బొమ్మ చూపించి వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. రాజమహేంద్రవరంలో సుమారు 60 వేల మంది పేద లకు పట్టాలు ఇస్తున్నామని కోరుకొండ మండ లం బూరుగుపూడి ఆవలో అంటగట్టే ప్రయత్నం చేశారు.అయితే నాడు ప్రతిపక్షంలో టీడీపీ ఆందోళనతో వెనుతిరిగివచ్చారు. ఈ భూముల్లో పెద్ద కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిం దే.ఆవ భూమిలో రైతుల చేత ముందుగా ఒప్పందం కుదుర్చుకుని,తక్కువ ధర పొలాలను ఎక్కువకు కొని డబ్బులు చేతులు మార్చుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.గత ఎన్నికల ముం దు వైసీపీ హడావిడిగా రాజానగరం మండలం లోని కానవరం,పల్లకడియం తదితర ప్రాంతాల్లో భూమిని కాగితాల్లో చూపి అక్కడ లేఅవుట్లు వేయకుండా పట్టాల మీద లబ్ధిదారుల పేర్లు రాసి పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ భూములు ఎక్కడున్నాయో కూడా లబ్ధిదారులకు తెలియని పరిస్థితి. జిల్లాలో అనేక చోట్ల ఇటువంటి పరిస్థితి నెలకొనడంతో లబ్ధిదారులు తమను వైసీపీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏ నియోజకవర్గం చూసినా ఏముంది!

జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పేదల ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇలా ఉంది. అనపర్తిలో 9043 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 1339 అసలు ప్రారంభించలేదు. 3590 పూర్త య్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజమహేంద్రవరం సిటీ పరిధిలో 11,712 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి.3959 అసలు మొదలెట్ట లేదు. 2318 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజానగరంలో 6800 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 1179 అసలు మొదలె ట్టలేదు. 3942 పూర్త య్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. గోకవరం మండలంలో 493 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి.5 అసలు మొదలెట్ట లేదు. 240 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. కొవ్వూరులో 11,388 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 2448 అసలు మొదలు పెట్టలేదు. 5410 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. నిడదవోలులో 12,130 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 3465 అసలు మొదలు పెట్టలేదు.6664 పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. గోపాలపురంలో 6001 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి. 3766 అసలు మొదలు పెట్టలేదు.1002 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 5056 ఇళ్లు శాంక్షన్ అయ్యాయి.1649 మొదలు పెట్టలేదు.2013 పూర్తయ్యాయి.మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.


వెలుగుబంద కాలనీలో పునాదిలోనే ఇల్లు

కొవ్వూరు

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

50 మందిపై బైండోవర్

ఉండ్రాజవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో 50మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. రానున్న సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



కోటసత్తెమ్మ దేవస్థానంలో వెండి తీర్థపు గిన్నె అందజేస్తున్న సత్య రాజ్‌కుమార్, ఝాన్సీరాణి దంపతులు

కోటసత్తెమ్మకు వెండి తీర్థపు గిన్నె అందజేత

నిడదవోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి కి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఇరదల సత్యరాజ్‌కుమార్, ఝాన్సీరాణి దంపతులు అమ్మవారికి 375గ్రాముల వెండి తీర్థపు గిన్నె గరిటెను ఆలయ సహాయ కమిష నర్ వి.హరి సూర్యప్రకాష్‌కు అందజేశారు. ఆలయ అర్చకులు అప్పారావుశర్మ, ఆలయ సూపరింటెండెంట్ గెల్లా సోమ రాజు ఉన్నారు.

గోష్పదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



గోష్పదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గోష్పదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో విశేషపూజలు జరిగాయి. బుర్రా ప్రకాష్ శర్మ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్ర బిల్వార్చన, సహస్ర కుంమార్చన, రుద్ర హోమం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు మానేపల్లి మానేపల్లి సుందర గణేష్, వై.వి.ఎస్. కామేశ్వరరావు, పమ్మి రవిబాబు, భక్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభకు తరలిన ఉపాధ్యాయులు

నల్లజర్ల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న యూటీఎఫ్ మహాసభకు నల్లజర్ల మండలం నుంచి ఉపాధ్యాయులు తరలి వెళ్లినట్లు జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్ తెలిపారు.విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్ఎం ఆలీ సాహెబ్ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు.



కొవ్వూరు నుంచి హైందవ శంఖారావానికి తరలివెళుతున్న కార్యకర్తలు



నల్లజర్లలో బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

భారతీయ సంస్కృతిని పరిరక్షించుకోవాలి

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర

కొవ్వూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి హిందువులంతా ఐక్యతను చాటుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణ, మండలం నుంచి హైందవ శంఖారానికి కార్యకర్తలు తరలివెళ్లారు. ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ - కేసరపల్లి వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు కొవ్వూరు నియోజకవర్గం నుంచి వేలసంఖ్యలో హిందూ సైనికులు ఆదివారం ఉదయం బయలుదేరారు. పట్టణంలోని మొక్కచింతల రామాలయంవద్ద నుంచి 5 బస్సులలో కార్యకర్తలు తరలివెళ్లారు. హిందూ ధర్మంపై, దేవాలయాలపై, సంస్కృతి సంప్రదాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించడంతోపాటు రక్షణ ఏర్పాటుచేయాలని కోరారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ హిందుత్వం అనేది మతం కాదని భారతీయుల జీవన విధానమన్నారు. భారత్ వేరు హిందుత్వం వేరు కాదన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమన్నారు. గతంలో భారత్ సంస్కృతి సంప్రదాయాలు, విద్య, ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచ దేశాలకు దిక్సూచిగా వ్యవహరించేదన్నారు. భారతీయులలో ఐక్యత లోపించడంతో విదేశీయులు దాడులు చేసి అన్నిరంగాలను ధ్వంసం చేసి, దేశ సంపదను కొల్లగొట్టి దోచుకున్నారన్నారు. ఇకనైనా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, దేవాలయాలను, కాపాడుకోవడంతోపాటు ఐఖ్యతను చాటుకోవాలన్నారు.

శంఖారావానికి తరలిన హిందువులు

చాగల్లు: విజయవాడలో జరిగిన హైందవ శంఖారావానికి చాగల్లు మండలం నుంచి హిందువులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండలం నుంచి సుమారు 8 బస్సులుతో సహా కార్లు, ద్విచక్ర వాహనాల్లో స్థానిక సెంటర్‌కి చేరుకున్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగాల శ్రీనివాసశర్మ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి తదితర అంశాలు ప్రధానంగా హైందవ శంఖారావం జరుగుతందన్నారు. బీజేపీ నాయకులు తాళ్ళూరి వరప్రసాద్, గ్రంధి రాంబాబు, హిందూ బంధువులు తరలివెళ్లారు.

బస్సులకు జెండా ఊపిన ఎమ్మెల్యే

నల్లజర్ల: విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం కార్యక్రమానికి నల్లజర్ల మండలం నుంచి 28 బస్సుల్లో 1500 మంది భక్తులు తరలివెళ్లారు. ఆదివారం ఉదయం నల్లజర్లలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. విశ్వ హిందూ పరిషత్ మండలాధ్యక్షులు కందుల రవి, వల్లూరి సత్తిపండు, ఉప్పలపాటి మాధవరావు, గుంటముక్కల రామకృష్ణ, గుదే సుబ్బారావు, ఆలపాటి ధనలక్ష్మి, తాతారావు, సవలం రామకృష్ణ శంఖారావం కార్యక్రమానికి వెళ్లిన వారిలో ఉన్నారు.

దేవరపల్లి: గన్నవరం సమీపంలో కేసరపల్లి హిందూ హైందవ శంకారావం సభకు మండలం నుంచి ఆదివారం భారీ సంఖ్యలో బస్సులపై తరలివెళ్లారు. సుమారు 15 బస్సుల్లో శంఖారావం సభకు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.





చాగల్లు, దేవరపల్లి నుంచి హిందూ హైందవ సభకు వెళుతున్న భక్తులు

పురాణ గాధలను ఆకళింపు చేసుకోవాలి

● బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ



ప్రవచనం చేస్తున్న మాడుగుల నాగఫణి శర్మ

అనపర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పురాణ గాధలను ఆకళింపు చేసుకోవడం ద్వారా ప్రతిఒక్కరూ మంచి నడవడికను పొందాలని పరోపకారం దిశగా ముందుకు సాగాలని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజైన ఆదివారం రాత్రి మాడుగుల నాగఫణి శర్మ ఆంధ్ర మహాభాగవతంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మహాభాగవతం నుంచి ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ప్రవచనం సాగించారు. ప్రముఖ న్యాయవాది వీబీఆర్ చెల్లయ్యబాబు సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రవచనాలను ఆలకించి పులకించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన ఆదిరెడ్డి, కొవ్వూరి రఘునాథరెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, మునీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌక డిపో డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

పెరవలి, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు చౌక డిపో డీలర్ల పోస్టు లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చుని తహసీల్దార్ అచ్యుత కుమారి తెలిపారు. ముత్యాలవారి పాలెం (బీసీఎడబ్ల్యూ) కడింపాడు, (ఎస్సీడబ్ల్యూ), పెరవలి బీసీబీ (డబ్ల్యూ), పెరవలి 2 ఓసీ, ముక్కామల ఎస్సీ డబ్ల్యూ, చౌక డిపోలను ఆయా వర్గాలకు రిజర్వు చేసినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పాస్ అయిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని ఇంటర్ పాస్ అయిన వారు లేకపోతే ఫెయిల్ అయిన వారిని పరిశీలిస్తామన్నారు. ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

పాతూరి రవికి డాక్టరేట్

● సేవా విభాగంలో గుర్తింపు



డాక్టరేట్ అందుకున్న నల్లజర్ల వాసి పాతూరి రవి

నల్లజర్ల, జనవరి5(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల గ్రామానికి చెందిన పాతూరి రవికి సేవా విభాగంలో పాండిచ్చేరి ప్రభుత్వం డాక్టరేట్ అందించింది. 15సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉండడంతో అమెరికన్ యూనివర్శిటీ ఆఫ్ గ్లోబల్ పీస్, ఇంటర్ నేషనల్ హ్యూమన్ ప్రోడెక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో చేసిన సర్వేలో డాక్టరేట్ లభించినట్లు రవి పేర్కొన్నారు. ఆదివారం పాండిచ్చేరి స్పీకర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. డాక్టరేట్ రావడంతో పూర్వవిద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో జాగ్రత్త చంద్రబాబు

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం చంద్రబాబు జాగ్రత్తగా ఉండాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరానితనాన్ని ఎదుర్కొన్నవారు ఎస్సీలు, వివక్షతను ఎదుర్కొన్నవారు అనాడు మహాత్మగాంధీ కృషి వల్లనైతేనేమీ, కాంగ్రెస్‌పార్టీ కృషి వల్లనైతేనేమీ ఎస్సీలయ్యారని చెప్పారు. ఆనాడు అంటరాని వారికి రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఇప్పుడు వర్గీకరణపై తీర్పు ఇచ్చిన ఏడుగురు జడ్జిలలో ఏ ఒక్కరికీ అంటరాని తనం తెలియదని, సుప్రీంకోర్టులో ఉన్న 35 మంది జడ్జిలలో ఒక్కరు కూడా ఎస్సీ కాలనీల్లో తిరగలేద ని చెప్పారు. సుప్రీకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇస్తే దానిని మన పక్కరాష్ట్రం తమిళనాడు సీఎం ఎం.స్టాలిన్ పక్కన పడేశాడని, కేరళ సీఎం విజయన్ చాలా అనుభవజ్ఞుడు నేర్పరి అతను కూడా జడ్జిమెంట్ కాపీని విసిరిపారేశాడని, కానీ మనరాష్ట్రంలో చంద్రబాబు కమిటీ వేయడం దారుణమన్నారు. కమిషన్ చైర్మన్‌గా యూపీకి చెందిన ఐఏఎస్‌ను వేశారన్నారు. ఆ చైర్మన్ రాష్ట్రంలోనే జడ్జిమెంట్ కాపీ గురించి పట్టించుకోలేదన్నారు. ఎస్సీలను విభజించాలనుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఎస్సీల సెన్సెస్ ఏపీలో తీశారని అస్సలు సెన్సెస్ తీసే అధికారం డిల్లీలో ఒక అధికారి ఉంటాడని ఆయనకే సెన్సెస్ తీసే హక్కు ఉంటుందని మిగిలిన వారికి ఉండదని చెప్పారు. సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ మానుకోకపోతే ఎస్సీలంతా రోడ్డుపైకి వస్తారు. పరిస్థితి పూర్తిగా మారుతుందని ఏపీలో ఏమవుతుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇక ఇరిగేషన్ ప్రాజెక్టులు రాజకీయ నాయకులకు కాసుల పంట పండిస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టుకు రూ.50వేల కోట్లు ఖర్చుచేశారని ఇందులో కుడి ఎడమకాలువలకు రూ.25వేలకోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఇంకా 25వేల కోట్లు బిల్లులు రావాల్సి ఉందన్నారు. పోలవరంపై రాజకీయ నాయకులు డబ్బుల సంపాదిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సీబీఐ విచారణ జరపాలన్నారు.

ఎన్‌డీఏ పాలనలో గ్రామాలకు మహర్దశ



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, కూటమి నాయకులు

చాగల్లు, జనవరి 5, (ఆంధ్రజ్యోతి) : ఎన్‌డీఏ పాలనలో గ్రామాలకు మహర్ధశ వంటిదని, సీసీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పంచాయతీ రాజ్ ద్వారా డిజస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్స్ నుంచి మంజూరైన నిధులు సుమారు రూ. 8కోట్లుతో చాగల్లు నుంచి లక్ష్మీపురం వరకు నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కాంట్రాక్టర్ మేడా వెంకట కృష్ణ వరప్రసాద్ రోడ్డుపనుల పరోగతిని ఎమ్మెల్యే కూటమి నాయకులకు వివరించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇంట ర్నల్ సీసీ రోడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గుంతలు పడిన బీటీ రోడ్లు మరమ్మతులు చాలావరకు పూర్తయ్యాయని, పంగిడి నిడదవోలు రోడ్డు మరమ్మతులు ఈవారంలో పూర్తవుతాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి మండలానికి రూ. 10 కోట్లుకుపైగా నిధులతో రోడ్లు, డ్రైన్‌లు నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, ఆళ్ళ సత్తిబాబు, అల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయపురంలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చాపల చంద్రమ్మ, మందా రామారావు, మందా నిర్మల ఇళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో ఆదివారం మాజీ మంత్రి తానేటి వనిత బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను వైసీపీ పార్టీ తరపున సహాయసహకారాలు అందిస్తామని మంత్రి వనిత అన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున ముగ్గురికి రూ.15వేలు, మూడు బస్తాల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, మండల వైసీపీ కన్వీనర్ కూచిపూడి సతీష్, ఎంపీటీసీ సత్తి జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ ఘాట్‌లో స్వచ్ఛ భారత్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు 48 మంది గోదావరి జలాలను శుభ్రంచేసి ప్లాస్టిక్ పదార్థాలను, చెత్త వ్యర్థాలను తొలగించారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆలయ స్తంభాలను గుడ్డతో తుడిచి వలంటీర్లు, స్వచ్ఛందంగా సేవ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కమిషనర్, విశ్రాంత ఆర్డీవో ఎం. జితేంద్ర, డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఎన్.ఎస్.ఎస్. సభ్యులు వీవీఎస్ కృష్ణారావు, జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు హాజరయ్యారు. జీవీఎస్ నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి సారథ్యం వహించగా, బీహెచ్ రమాదేవి, పి.సాయి, శిరీష, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్‌లో స్వచ్ఛభారత్

దేవరపల్లి పంచాయతీలో

కుంటుపడిన పారిశుధ్యం



దేవరపల్లిలో పంచాయతీ కార్యదర్శులను నిలదీస్తున్న పంచాయతీ వార్డు సభ్యులు

దేవరపల్లి, జనవరి5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్యం కుంటుపడిందని పంచాయతీ వార్డు సభ్యులు గద్దే రమాదేవి, పచ్చా రామ్‌గోపాల్, కరుటూరి బాలాజీ, తంగెళ్ళ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎన్.రవికిషోర్‌ను నిలదీశారు. దేవరపల్లిలో పల్లంట్ల రోడ్డులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని డ్రైనేజీలు పూడుకుపోయిన తొలగించటంలేదని గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని, పంచాయతీ రెండు బోర్డు సమావేశాల్లో కూడా దీనిపై కార్యదర్శులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని విమర్శించారు. పల్లంట్ల రోడ్డులో పారిశుధ్య పనులు చేయడానికి వచ్చిన సిబ్బంది పైన పంచాయతీ కార్యదర్శి పైన వార్డుసభ్యులు వాగ్వాదానికి దిగారు. గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతుంటే ఏం చేస్తున్నారని పారిశుధ్యం మీకు పట్టదా అంటూ ఆవేశంగా సెక్రటరీపై కేకలు వేశారు. దీనిపై కార్యదర్శి ఎన్.రవికిషోర్ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్తను తొలగిస్తామని తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

సంక్రాంతి సంబరాలు



దేవరపల్లి ఆర్యవైశ్య సంఘం సంక్రాంతి సంబరాల్లో కోడిపందాలు తిలకిస్తున్న మహిళలు

దేవరపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో ఆదివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో జంగందేవర, హరిదాసు, కోడిపందాలు, బొమ్మలకొలువు, పాలపొంగులు, గ్రామీణ వాతావరణం గుడిసే సెట్టింగు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వివిధ నృత్య ప్రదర్శనలు, బొమ్మల తయారిలోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు తీగల మంజూ మాట్లాడుతూ గత ఆరుసంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. తమ పిల్లలకు సంస్కృతి సాంప్రదాయాలు తెలిపే విధంగా ఈ పండుగలు చేసుకోవడం వలన వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

నిడదవోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం ఎంతో ఆనందకరమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ఆదివారం నిడదవోలులోని తిరుచానూరు పద్మావతి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ కాపు ఉపాధ్యాయులు తమ వార్షికోత్సవం సందర్భంగా విద్యకు, విద్యారంగానికి అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు అసోసియేషన్ తరఫున ఆయన స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రంగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

పాడి రైతుల సంక్షేమానికి పనిచేస్తాం

● చైర్మన్ చలసాని ఆంజనేయులు

నల్లజర్ల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమం కోసం కృష్ణ మిల్క్ యూనియన్ పనిచేస్తుందని కృష్ణ మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. ఆదివారం పుల్లలపాడు,ముసుళ్ళకుంట గ్రామాలకు సంబంధించిన రైతులకు 2024-25 ఏప్రిల్ నుంచి నవంబరు వరకు డైయిరీ బోనస్ రూ.7లక్షల27వేలు అందించారు. రెండు పాల కేంద్రాలకు సంబంధించి మూడు సంవత్సరాల్లో 6లక్షల30వేలు బోనస్ పంచారు. ప్రకృతి విప త్తువల్ల కలిగిన నష్టం సర్వీస్‌లు పశు ఆరోగ్యం కోసం పశు వైద్య శిబిరాలు, ఇన్సూరెన్స్ కళ్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ పథకాలు, బ్రీడెడ్ సెమన్, పశుదాణా,మందులు, మినరల్ మిక్చర్ వంటి సదుపాయలు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా కొనసాగుతున్న అ ల్లూరి దుర్గారావును చైర్మన్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముసుళ్ళకుంట అధ్యక్షులు నందమూర్తి రామకృష్ణ, ఘంటా నాగేశ్వరావు, యలమాటి ఆనంద్, మద్దిపాటి దుర్గారావు, పెండ్యాల రాఘవులు పాల్గొన్నారు.



అల్లూరి దుర్గారావును సత్కరిస్తున్న కృష్ణ మిల్స్ యూనియన్ అధ్యక్షుడు ఆంజనేయులు

వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా

శ్రీనివాసరావు, సొంగ రాజు



పెరవలి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెరవలి వీఆర్వో సొంగ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాజమండ్రిలో జిల్లా వీఆర్వోల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రాజానగరం మండలం వెలుగుబండ వీఆర్వో టి.శ్రీనివాసరావు ఎన్నిక కాగా పెరవలి వీఆర్వో సొంగ రాజు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని రెండు డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు రాష్ట్ర మెంబర్లు హాజరయ్యారని సొంగ రాజు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: ముఫాస
వై.స్క్రీన్2 : క్రావెన్ ధ హంటర్, మార్కో	
దేవిశ్రీ (గాయత్రి	:
అనన్య	: పుష్ప-2

నిడదవోలు

వీ మ్యాక్స్	: పుష్ప-2
రాధాకృష్ణ	: ముఫాస
శ్రీగణపతి	: మార్కో

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2
త్రినాథ్ సినీ మ్యాక్స్	: పుష్ప-2